సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 15 | ఫిబ్రవరి | 2025



కాంట్రాక్ట్ టీచర్లుగా 2008 డీఎస్సీ అభ్యర్థులు

- 8లో

డీఎస్సీ-2008లో క్వాలిఫై అయిన జీఈడీ అభ్యర్థులను కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది.



విద్యార్థులకు అస్వస్థత

- 8లో

హసన్‌పర్తి మండలం జయగిరిలోని ఎంజేపీలో బాదంకాయల మాదిరిగా ఉన్న వాటిని తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $34^0/17^0$

జిల్లాలో ఉదయం నుంచి సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సర్వీస్ కొనసాగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ ఇటీవల రిటైర్డ్ అయిన ముగ్గురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను కొనసాగిస్తూ రిజిస్ట్రార్ వి.రాంచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన బాటనీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బీఏ జర్నలిజం విభాగానికి చెందిన ఆర్.ఆదిరెడ్డి, కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఉషారాణి సర్వీస్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయవ్యవస్థపై దాడి అమానుషం



వరంగల్ లీగల్: రంగారెడ్డి జిల్లా 9వ అదనపు కోర్టు జడ్జిపై గురువారం జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై దాడిగా భావిస్తున్నామని, ఇది అమానుష చర్య అని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అన్నారు. దాడికి నిరసనగా శుక్రవారం జిల్లా కోర్టు ఎదుట వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా అధ్యక్షుడు జీవన్‌గౌడ్ మాట్లాడుతూ.. నిందితులు, కక్షిదారులు తమ ప్రయోజనాలు నెరవేరలేదనే కక్షతో న్యాయమూర్తులు, న్యాయవాదులపై దాడులు చేయడం సహించరాని విషయమని, ప్రభుత్వం సత్వరమే నిందితులపై చర్యలు తీసుకోవాలని, న్యాయవ్యవస్థలో పనిచేసే వారి కోసం రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈచర్యపై ప్రజలంతా నిరసన తెలపాలని హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, జయాకర్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు లడే రమేశ్, సుదర్శన్, చారి, విజయేందర్, మురళి, సహోదర్‌రెడ్డి, అంబరీశ్, రాజేంద్రప్రసాద్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్ల నియామకం



కేయూ క్యాంపస్: కేయూ హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్లుగా ఫిజిక్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.నరేందర్, మైక్రో బయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ సుజాతను నియమిస్తూ శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు పదవిలో ఏడాదిపాటు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

సీడీపీఓ కార్యాలయ స్థల మార్పు

కాజీపేట అర్బన్: హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ ఎదురుగా కొనసాగుతున్న హనుమకొండ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కార్యాలయాన్ని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం పక్కకు మార్చినట్లు శుక్రవారం సీడీపీఓ విశ్వజ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'ఎన్‌హెచ్‌ఎం'తో తగ్గిన మరణాలు



ఎంజీఎం: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్ల మాతా శిశు మరణాల రేటు చాలా వరకు తగ్గిందని.. మరింత మెరుగైన సేవలందిస్తూ గర్భిణుల్లో అనారోగ్యాన్ని ముందుగానే గుర్తించి తగిన సేవలందించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆర్మన్ స్వచ్ఛంద సంస్థ, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా జిల్లాలోని పలు యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల ఏఎన్ఎంలకు నిర్వహించిన శిక్షణలో అప్పయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయకుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, వైద్యులు సంతోషిని, సౌజన్య, డెమో అశోక్‌రెడ్డి, ఎస్‌ఓ ప్రసన్నకుమార్, హెచ్ఈఓ రాజేశ్వర్‌రెడ్డి, డీడీఎం ప్రవీణ్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.







జంపన్నలో స్నానం.. అమ్మవార్ల దర్శనం

మినీ మేడారం జాతరలో మూడో రోజు శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు జంపన్నవాగులో జల్లుస్నానాలు ఆచరించి గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. - ఎస్ఎస్ తాడ్వాయి

- 8లో

కోటలో ఆస్ట్రేలియన్ల సందడి



ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలావరంగల్ కోటను శుక్రవారం ఆస్ట్రేలియా దేశస్తులు సందర్శించారు. ఈసందర్భంగా శిల్ప కళా సంపదను ఆసక్తిగా తిలకించారు. ఆతర్వాత ఖుష్‌మహల్‌ను వారు సందర్శించి నిర్మాణ శైలి మహా అద్భుతంగా ఉందని కొనియాడారు. కాకతీయుల చరిత్ర, విశిష్టత గురించి కోట గైడ్ రవియాదవ్ విదేశీయులకు వివరించారు. సాయంత్రం టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయుల చరిత్రను వివరించే సౌండ్, లైటింగ్ షోను తిలకించారు. కార్యక్రమంలో టీజీటీడీసీ ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, పురావస్తుశాఖ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

డీసీసీ పీఠాలపై ఎవరు..



జిల్లా కాంగ్రెస్ కమిటీలపై టీపీసీసీ కసరత్తు

- 'స్థానిక'ఎన్నికలే లక్ష్యంగా కొత్త కమిటీలు
- జిల్లా అధ్యక్షుల నియామకంపై అభిప్రాయ సేకరణ
- ఎమ్మెల్యేలు, సీనియర్లతో అధిష్టానం సంప్రదింపులు
- అవకాశం రాని సీనియర్లకు టీపీసీసీలో స్థానం
- నెలాఖరులో కొలిక్కి వచ్చే అవకాశం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లపై కసరత్తు క్లైమాక్స్‌కు చేరుకుంటోంది. ప్రభుత్వ పథకాల ప్రచారంతోపాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కమిటీలుండాలని అధిష్టానం భావిస్తోంది. ఈ ఏడాదంతా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీల పాలకవర్గం పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. మరోవైపు ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా డీసీసీల నియామకంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది.

ఎమ్మెల్యేలు లేదంటే సీనియర్లు..

టీపీసీసీ, అధిష్టానం సంకేతాల మేరకు త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి కొత్త జిల్లా అధ్యక్షులు రానున్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి, సమన్వయం చేయగలిగే వ్యక్తులను ఎంపిక చేయాలని ఆలోచిస్తున్న అధిష్టానం.. ఆర్థికంగా బలంగా ఉండే వాళ్లను తీసుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలను గానీ, సీనియర్లను గానీ ఈసారి నియమించే అవకాశం ఉందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ఇద్దరు, వరంగల్‌లో ముగ్గురు, మహబూబాబాద్‌లో ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలున్నారు. జనగామలో ఇద్దరు, ములుగు, జేఎస్ భూపాలపల్లిలో ఒక్కరేసి ఉన్నారు.

- హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి కొనసాగాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని అధిష్టానం కోరుతున్నా ఆయన ససేమిరా అంటున్నట్లు తెలిసింది. పార్టీ సీనియర్, తనకు అనుచరుడిగా ఉండే ఇద్దరు పేర్లు సూచిస్తున్నట్లు చెబుతున్నారు.
- వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణనే కొనసాగించాలని కొందరు.. కొత్తవాళ్లకు అవకాశం ఇవ్వాలని మరికొందరు సూచించినట్లు సమాచారం. ఈవిషయంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి నిర్ణయం ఫైనల్ కానుంది.
- మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భరత్‌చంద్రారెడ్డినే కొనసాగిస్తారన్న చర్చ ఉండగా.. డోర్నకల్, మహబూబాబాద్, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్‌లతోపాటు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి నిర్ణయం కీలకం కానుంది.
- జేఎస్ భూపాలపల్లి అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నందున.. అయననే కొనసాగించాలా? మార్చాలా? అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో టీపీసీసీ చర్చించింది.
- ములుగు జిల్లా నుంచి మళ్లీ పైడాకుల అశోక్‌కే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది.
- జనగామ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ ఏర్పడుతోంది. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కొనసాగించలేని పరిస్థితి వస్తే ఎలా? అన్న చర్చపై ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అత్త, పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పేరును ఆ జిల్లా ఎమ్మెల్యేలు ప్రతిపాదించినట్లు ప్రచారం ఉంది.

అనివార్యంగా మారిన డీసీసీ అధ్యక్షుల నియామకం..

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల తర్వాత రేవంత్ రెడ్డి సిఫారసు మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ డీసీసీ కమిటీలను ప్రకటించారు. రెండు విడతల్లో ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు అధ్యక్షులను నియమించారు. మొదటి విడతలో నియమితులైన అధ్యక్షుల పదవీకాలం రెండేళ్లు దాటిపోగా.. రెండో విడత డీసీసీలకు రెండేళ్లు కావొస్తోంది. ఈ నేపథ్యంలో అధిష్టానానికి కొత్త కమిటీల ఏర్పాటు అనివార్యంగా మారింది. 2022, డిసెంబర్ 10న హనుమకొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు డీసీసీ అధ్యక్షులుగా నాయిని రాజేందర్ రెడ్డి, నల్లెల కుమారస్వామి, జె.భరత్‌చంద్రారెడ్డిలను నియమించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ములుగు జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. 2023, మే 16న కుమారస్వామి స్థానంలో పైడాకుల అశోక్‌ను ములుగు అధ్యక్షుడిగా.. వరంగల్‌కు మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జేఎస్ భూపాలపల్లికి ఎ.ప్రకాశ్‌రెడ్డిని నియమించారు. జనగామ జిల్లా అధ్యక్షుడి నియామకం అప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య వివాదంగా మారినా.. చివరకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డినే నియమించారు. ఆ తర్వాత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది రేవంత్‌రెడ్డి సీఎం కావడం, టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్‌గౌడ్ నియమితులయ్యారు.

వెయిటేజీ మార్కుల దందా

కేఎంసీలోని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల చేతివాటం

- ల్యాబ్ అటెండెంట్లకు టెక్నీషియన్లుగా సర్టిఫికెట్లు
- ఎంజీఎం అధికారులను తప్పుదోవ పట్టించిన నిర్వాహకులు
- మెమోలు జారీ చేసిన అధికారులు



ఎంజీఎం : ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల దందా రోజురోజుకూ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ నియామక ఏజెన్సీలను దక్కించుకున్న నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నిరుద్యోగ అభ్యర్థులనుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. కాకతీయ మెడికల్ కళాశాల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను దక్కించుకున్న నిర్వాహకులు ఏకంగా ఎంజీఎం పరిపాలనాధికారులను తప్పుదోవ పట్టించారు. అర్హత లేని ఉద్యోగులకు వెయిటేజీ మార్కులు కల్పించేలా ల్యాబ్ అటెండెంట్లకు ల్యాబ్ టెక్నీషియన్లుగా ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశారు. వెయిటేజీ మార్కుల విషయంలో మరోమారు విచారణ చేయాలని ఎంజీఎం అధికారులకు మెయిల్ రావడంతో అసలు ఏం జరిగిందని విచారించగా అనేక విషయాలు వెలుగుచూశాయి.

అసలేం జరిగిందంటే..

వైద్యారోగ్యశాఖలో స్టాఫ్‌నర్సులతోపాటు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టుల నియామకాల కోసం ప్రభుత్వం గత ఏడాది నవంబర్ నెలలో రాత పరీక్షలు నిర్వహించింది. అభ్యర్థులకు రాత పరీక్షల మార్కులతోపాటు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల్లో పనిచేసిన ఉద్యోగులకు ఆయా విభాగాల అధికారుల ద్వారా సర్వీసును బట్టి వెయిటేజీ మార్కులు కల్పిస్తారు. ఈ మార్కులతో అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలను పొందవచ్చు. ఈ విషయాన్ని గమనించిన కేఎంసీలోని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు నిర్వాహకులు తెలివిగా వ్యవహరించారు. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో 12 మంది ల్యాబ్ అటెండెంట్లు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమితులయ్యారు. 16మంది అభ్యర్థులు రాత పరీక్షల్లో పాల్గొనగా ఆస్పత్రిలో పనిచేసే మూడు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లకు మాత్రమే సర్టిఫికెట్లు ఇచ్చే అర్హత ఉంటుంది. కానీ నిర్వాహకులు తెలివిగా ల్యాబ్ అటెండెంట్లను సైతం టెక్నీషియన్‌గా పేర్కొంటూ వారికి వెయిటేజీ మార్కులు కల్పించారు. మొత్తం 16 మంది అభ్యర్థులను టెక్నీషియన్లుగా పేర్కొంటూ ఎంజీఎం పరిపాలనాధికారులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. ఈ సర్టిఫికెట్ల సమర్పిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని భావించిన నిర్వాహకులు.. ఆయా అభ్యర్థులనుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

ఎంజీఎం అధికారుల పునర్విచారణ..

ప్రభుత్వ ఉద్యోగాల్లో అభ్యర్థులకు కల్పించిన వెయిటేజీ మార్కుల విషయంలో మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఆర్‌బీ)నుంచి ఎంజీఎం అధికారులకు ఓ మెయిల్ వచ్చింది. వీటిని తిరిగి విచారణ చేసి ధ్రువీకరించాలని ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో ఎంజీఎం అధికారులు విచారణ చేశారు. అటెండెంట్లకు టెక్నీషియన్లుగా సర్టిఫికెట్లు ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో సంబంధిత ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు మెమోలు జారీ చేశారు. ఈక్రమంలో శుక్రవారం సదరు నిర్వాహకులను పిలిచి విచారణ చేశారు. తమకు తెలియకుండా తప్పు జరిగిపోయిందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. వెయిటేజీ మార్కులు పొందిన అభ్యర్థులను పూర్తిస్థాయిలో విచారిస్తే వారినుంచి ఏజెన్సీలు ఎంత వసూలు చేశాయో బయటపడుతుందని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు

- సమస్య ఉంటే శ్రేయోభిలాషులకు తెలపండి
- సీపీ అంబర్ కిషోర్ ఝా
- పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు




మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని, విధి నిర్వహణలో ఏదైనా వ్యక్తిగత సమస్యలతో ఒత్తిళ్లకు గురైతే మీ శ్రేయోభిలాషులకు, స్నేహితులకు తెలపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. 'విధి నిర్వహణతో పాటు వ్యక్తిగతంగా ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లను నియంత్రించడం ఎలా' అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లోని రుద్రమదేవి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వహించే పోలీస్ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, క్రమశిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించడంతోనే ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చన్నారు. వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమన్నారు. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఒత్తిళ్లు అధిగమించేందుకు ప్రతీరోజు వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. అంతకుముందు నగరానికి చెందిన మనస్తత్వవేత్తలు డాక్టర్ జ్యోతి, స్వరూప, బెన్‌సన్లు మానసిక ఒత్తిళ్లను ఏవిధంగా నియంత్రించుకోవాలో పోలీస్ సిబ్బంది, అధికారులకు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, అదనపు డీసీపీలు రవి, సురేశ్, ఏసీపీలు జితేందర్, మధుసూదన్, నాగయ్య, అనంతయ్య, ఏఓ రామకృష్ణ ఆర్.ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, పరిపాలన విభాగం అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల కల్పనకు నిధులు వినియోగించాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను ఆయా పాఠశాలల్లో వివిధ వసతుల కల్పనకు సత్వరమే వినియోగించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీఎం శ్రీ పథకం నిధుల వినియోగం, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అధికారులతో పాటు ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏఈలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఆయా పాఠశాలల్లో నిధులతో గ్రంథాలయం ఏర్పాటు, మ్యూజికల్ బ్యాంకు ఏర్పాటు క్రీడోత్సవాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు స్నాక్స్ అందించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ వాసంతి, సమగ్రశిక్ష గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బద్దం సుదర్శన్ రెడ్డి, జీసీడీఓ సునిత, ప్రణాళిక అధికారి బి.మహేశ్, సహాయ గణాంక సమన్వయకులు రఘు చందర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ, 'పాక్స్'ల పదవీకాలం పొడిగింపు

- మరో ఆరు నెలలు కొనసాగే అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్, డీసీసీబీ చైర్మన్లు

సాక్షిప్రతినిధి, వరంగల్ : రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పాక్స్) పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. మరో ఆరు నెలల పాటు పదవిలో కొనసాగేలా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గం గడువు శుక్రవారంతో ముగియగా.. అదే రోజున మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీలు, ఎంపీపీ, జిల్లా పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. సహకార సంఘాలకు కూడా ప్రత్యేక అధికారుల నియామకం ఇబ్బందికరం కాగా.. పాలకవర్గాల అభ్యర్థన మేరకు ప్రభుత్వం 'పాక్స్'ల పదవీకాలం ఆరు నెలలు పొడిగించినట్లు చెబుతున్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఉమ్మడి వరంగల్‌లో 91 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పాలకవర్గాలు మరో ఆరు నెలలు సేవలు అందించనున్నాయి. ఇదిలా ఉండగా.. సహకార సంఘాల పదవీ కాలం పొడిగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కొండా సురేఖకు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వంలో సహకార సంఘాలకు అందిస్తున్న సహాయ సహకారాలకు ధన్యవాదాలని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సంఘాల బలోపేతానికి రాబోయే రోజుల్లో మరింత కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ప్రజల్లో అవగాహన పెంచాలి

- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కంపోస్ట్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్: తడి, పొడి చెత్తను ఇళ్లల్లో వేర్వేరు డబ్బాల్లో వేసి అందించేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం వరంగల్ పోతన సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, కంపోస్ట్ యూనిట్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పొడి చెత్త సేకరణ రిజిస్టర్‌ను పరిశీలించారు. తనిఖీల్లో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌రాజ్, వెంకన్న, ఐటీసీ వావ్ ప్రతినిధి పవన్, ఏంఐఎస్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు చేయాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 26న శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వరంగల్‌లోని కాశీవిశ్వేశ్వర స్వామి, స్వయంభు దేవాలయం, ఆకారపు బొమ్మలగుడి, దుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయం తదితర ఆలయాల్లో రుద్రాభిషేకం, సామూహిక బిల్వార్చన, రుద్ర హోమం, ప్రవచనాలతోపాటు క్యూలైన్ మేనేజ్‌మెంట్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సునీత, ఈఓ రత్నాకర్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, బల్దియా ఉప కమిషనర్ ప్రసన్నరాణి, ఈఈలు మహేందర్, శ్రీనివాస్ ఎంహెచ్‌ఓ రాజేశ్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఎస్సై చాంద్‌పాషా పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలి

జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి భూములు ఇచ్చి రైతులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో భూ సేకరణకు సంగెం గ్రామ రైతులతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేతో జిల్లా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట రూరల్: కాజీపేట–విజయవాడ మధ్య జరుగుతున్న రైల్వే నాన్ ఇంటర్ లాకింగ్ సిస్టం వర్క్ బ్లాక్‌తో పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. రైళ్ల దారి మళ్లింపుతో కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడనున్నారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు షాలీమార్–హైదరాబాద్ (18045) డైలీ వెళ్లే షాలీమార్ ఎక్స్‌ప్రెస్, ముంబాయి–భువనేశ్వర్ (11019) డైలీ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ముంబాయి (11020) డైలీ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్–షాలీమార్ (18046) డైలీ వెళ్లే షాలీమార్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 19వ తేదీన షాలీమార్–సికింద్రాబాద్ (22849) వెళ్లే షాలీమార్ ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

ఈ నెల 18, 19వ తేదీన ఆదిలాబాద్–తిరుపతి (17406) డైలీ వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను నిర్ణీత సమయం కన్నా 90 నిమిషాల తేడాతో రీషెడ్యూల్‌గా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

'వందేభారత్' కోచ్‌ల తగ్గింపు

ఈ నెల 19వ తేదీ నుంచి కాజీపేట మీదుగా నాగపూర్ – సికింద్రాబాద్– నాగపూర్ (20101/201002) మధ్య ప్రవేశపెట్టిన నాగపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లను తగ్గించి నడిపిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. నాగపూర్–సికింద్రాబాద్ ప్రధాన నగరాల ప్రాధాన్యతను, ఈ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసి ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి పెద్దగా ఆధారణ రాకపోవడంతో కోచ్‌ల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో గడిచిన 5 నెలల్లో ఆక్యుపెన్సీ రేటు కేవలం 33 శాతం మాత్రమే ఉండటడంతో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లోని 20 నుంచి 8 కోచ్‌లకు తగ్గించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఎక్స్‌ప్రెస్‌కు సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని ప్రయాణికుల డిమాండ్ ఉంది.

భక్తులపై తేనెటీగల దాడి

ఎస్‌ఎస్ తాడ్వాయి : ములుగు జిల్లా మేడారం జాతరకు శుక్రవారం వచ్చిన భక్తులపై తేనెటీగలు దాడి చేయగా సుమారు 15మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించగా వైద్యాధికారులు చికిత్స చేశారు. వైద్యశిబిరం సందర్శనకు వచ్చిన డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తేనెటీగల దాడిలో గాయపడినవారితో కలిసి శుక్రవారం 110 మందికి వైద్యసేవలు అందించినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. మేడారం జాతరలో ఈగలు, దోమలు వ్యాపించకుండా మటన్, చికెన్ షాపులు ఏర్పాటు చేసిన యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ యమున, డీపీఎంఓ సంజీవరావు, దుర్గారావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మక్క సారలమ్మ ప్రతిరూపాలకు పూజలు చేస్తున్న రాముయాదవ్ కుటుంబ సభ్యులు



బంగారంతో మహిళా భక్తులు



సారలమ్మ గద్దె వద్ద భక్తుల మొక్కులు



'జంపన్న'లో స్నానం..అమ్మవార్ల దర్శనం

- వనదేవతలకు మొక్కులు సమర్పించిన భక్తులు
- మార్మోగిన గద్దెల ప్రాంగణం
- నేటితో మినీ జాతర ముగింపు



గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మల గద్దెల ప్రాంగణం శుక్రవారం భక్తుల రద్దీతో కోలాహలంగా మారింది. అమ్మవార్లను దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర, సారె, ఎత్తు బంగారం, పూలు, పండ్లు, ఒడి బియ్యం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం పరిసరాలన్నీ భక్తుల రద్దీతో కనిపించాయి. మొక్కుల అనంతరం భక్తులు వంటావార్పు చేసుకొని సహఫంక్తి భోజనాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా నేటి (శనివారం)తో మేడారం మినీజాతర ముగియనుంది.

జాతరలో మెరుగ్గా పారిశుద్ధ్య పనులు..

మేడారం మినీజాతరలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కార్మికులు చెత్త, చెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నారు. రోడ్ల వెంట దుమ్ము, దూళి లేవకుండా ట్యాంకర్లతో నీళ్లు చల్లుతున్నారు. డీపీఓ దేవరాజ్ పారిశుద్ధ్య పనులు నిరంతరం పర్యవేక్షిస్తూ చెత్త సేకరణపై కార్మికులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు.

భక్తులకు ఉచిత తాగునీరు

మేడారంలో భక్తులకు అక్కడక్కడ ఉచిత తాగు నీటి శిబిరాలను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని శిబిరాలను తరలించి భక్తులకు అందిస్తున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఉచిత తాగునీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎండతీవ్రత పెరగడంతో భక్తులకు ఉచిత తాగు నీటి శిబిరాలు దాహాన్ని తీరుస్తున్నాయి.



షవర్ల కింద స్నానాలు చేస్తున్న భక్తులు



పూజా మందిరంలో పొగలు..

ఎండోమెంట్ కార్యాలయంలో శాలాహారం ప్రహరీకి అనుకొని ఉన్న వనం పూజా మందిరంలో పొగలు వ్యాపించాయి. మందిరంలోని చెత్త చెదారానికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో అక్కడే ఉన్న దేవాదాయ శాఖ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది స్పందించి ఫైర్ ఇంజన్ ద్వారా మంటలను చల్లార్చారు. పూజా మందిరంలో ఒక్కసారి పొగ వ్యాపించడంతో ఎండోమెంట్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ఏం జరిగిందోనని ఆందోళన చెందారు.

ఎత్తు బంగారంతో అమ్మవారి ప్రతిరూపం

అమ్మవార్లకు మొక్కుగా సమర్పించే ఎత్తు బంగారంతో సమ్మక్క, సారలమ్మల ప్రతిరూపాలుగా అలంకరించిన హైదరాబాద్‌కు చెందిన రాముయాదవ్ కుటుంబ సభ్యుల తీరు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'తరతరాల నుంచి అమ్మవార్లను పూజిస్తున్నాం. ప్రతీ మహాజాతరకు కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం 500 మంది కలిసి మేడారానికి వస్తుంటాం. మినీజాతర సందర్భంగా జాతరకు వచ్చి అమ్మవార్లకు ప్రత్యేకంగా మొక్కులు చెల్లిస్తాం. అలాగే అమ్మవార్లకు మొక్కుగా 10 రకాల మద్యాన్ని ఆరగించి పూజలు చేశామని, యాటపోతుతో నైవేద్యం సమర్పించాం విడిది చేసే చోట బంగారంతో అమ్మవార్ల ప్రతిరూపాలను చేసి పూజలు, నైవేద్యం సమర్పించాకే గద్దెలకు వెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ' అని వారు తెలిపారు.



బంగారంతో దర్శనానికి వెళ్తున్న భక్తులు



పూజామందిరంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అందరి సహకారంతో విజయవంతం: కలెక్టర్ దివాకర

అన్ని శాఖల అధికారుల సమన్వయంతోనే మేడారం జాతర విజయవంతమైందని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శుక్రవారం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. మినీ జాతరకు వచ్చిన భక్తులతో మేడారం సందడి వాతావరణం సంతరించుకుందన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు కల్పించామన్నారు. ఈనెల 16న (ఆదివారం) సెలవు రోజు భక్తుల వేలాది తరలివస్తారనే అంచనాతో అప్పటి వరకు కావాల్సిన ఏర్పాట్లు కూడా చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత చర్యల కోసం పోలీసులు చర్యలు చేపట్టారన్నారు. జాతర కవరేజ్ చేసి సహకరించిన మీడియాకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా కలెక్టర్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సాంప్రదాయంగా దేవాదాయ శాఖ అధికారులు, పూజారులు కలెక్టర్‌కు స్వాగతం పలికి దగ్గరుండి దర్శనం చేయించి అమ్మవార్ల ప్రసాదం అందించారు. కలెక్టర్ వెంట ఈఓ రాజేంద్రం, మంగపేట తహసీల్దార్ రవీందర్, డీటీ సురేష్‌బాబు, తదితరులు ఉన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న కలెక్టర్ దివాకర



ఉచిత తాగు నీటి శిబిరం వద్ద..



క్యూలైన్‌లో దర్శనానికి వెళ్తున్న భక్తులు

కాంట్రాక్ట్ టీచర్లుగా 2008 డీఎస్సీ అభ్యర్థులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 182మంది ఎస్‌జీటీలుగా ఎంపిక
- నేడు డీఈఓ కార్యాలయాల్లో నియామక పత్రాలు అందజేత



విద్యారణ్యపురి: 2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన బీఈడీ అభ్యర్థులను అప్పట్లో ఎస్‌జీటీలుగా ఎంపిక చేయలేదు. దీంతో వారు కొన్నేళ్లుగా తమను టీచర్లుగా నియమించాలని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు సర్కారు కరుణ చూపింది. కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 182మంది అభ్యర్థులు ఉండగా, వీరికి శనివారం ఆయా జిల్లాకేంద్రాల్లోని డీఈఓ కార్యాలయాల్లో నియామకపత్రాలు అందించనున్నారు.

ఇటీవల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

2008 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఇటీవల హనుమకొండ డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 295మంది అభ్యర్థులకుగాను 182మంది సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఎంపికైన వారు శనివారం తమ ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో కేటాయించిన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లాలి. సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించి డీఈఓల చేతుల మీదుగా కాంట్రాక్ట్ ఎస్‌జీటీగా నియామక పత్రాలు అందించనున్నారు.

నెలకు రూ.31,040 వేతనం

కాంట్రాక్ట్ టీచర్లుగా నియమితులైనవారికి నెలకు రూ.31,040 వేతనం ఇవ్వనున్నారు. నియమ నిబంధనల ప్రకారం రూ.100 బాండ్ పేపర్ సమర్పించాలి. ఆ తరువాత కేటాయించిన పాఠశాలలో విధులకు హాజరుకావాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా అభ్యర్థులు ఇలా..

వరంగల్	08
హనుమకొండ	18
జేఎస్ భూపాలపల్లి	43
ములుగు	28
మహబూబాబాద్	52
జనగామ	33

కేయూలో టాప్ సైంటిస్టులు వీరే..



రిటైర్డ్ ప్రొఫెసర్ రఘురామారావు | రిటైర్డ్ ప్రొఫెసర్ సిద్దివీరేశం | రిటైర్డ్ ప్రొఫెసర్ సదానందం | ప్రొఫెసర్ ఇస్తారి | ప్రిన్సిపాల్ ప్రసాద్

కేయూ క్యాంపస్: ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది యూనివర్సిటీలు, శాస్త్రవేత్తలకు ర్యాంకింగ్స్ ఇచ్చే అమెరికాకు చెందిన ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్(అల్పర్ డోగల్) ఈ ఏడాది జాబితాను విడుదల చేసింది. పరిశోధనా పత్రాల హెచ్ ఇండెక్స్ ఐ 10 ఇండెక్స్ సైటేషన్స్ ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను ఖరారు చేశారు. కాకతీయ యూనివర్సిటీలో టాప్ ఐ సైంటిస్టుల జాబితాను కూడా సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ ప్రపంచ, జాతీయ, ప్రాంతీయ విషయాల్లో 13 ప్రధాన రంగాలు, 197 ఉప శాఖల్లో అత్యంత సమగ్రమైన విశ్లేషణను అందిస్తుంది. ఈ విశ్లేషణలు గత 6 సంవత్సరాల నుంచి వాటి విలువలతో సహా హెచ్ ఇండెక్స్ ఐ 10 ఇండెక్స్, సైటేషన్ కౌంట్ వంటి సూచికలపై ఆధారపడి ఉంటాయి. 2025 ఈనెల 14 నాటికి ర్యాంకింగ్‌లు మొత్తం హెచ్ ఇండెక్స్ ప్రకారం నిర్ణయించబడి సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రపంచంలో 221 దేశాల్లో 24,503 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న సైంటిస్టుల పరిశోధనలు ఈ సంస్థ పరిశీలన చేయగా అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కేయూ 960 స్థానంలో నిలిచింది.

కేయూ సైంటిస్టులు..

యూనివర్సిటీ స్థాయిలో టాప్ 5 సైంటిస్టులుగా కేయూకు చెందిన ఐదుగురు ప్రొఫెసర్లకు స్థానం లభించింది. కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ రఘురామారావు మొదటిస్థానం, అదే కళాశాలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ సిద్ది వీరేశం రెండోస్థానం, బయోటెక్నాలజీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు సదానందం మూడో స్థానం, జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి నాల్గో స్థానం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ ఐదో స్థానంలో నిలిచారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పరిశోధనలపరంగా నాలుగు పేటెంట్లు కలిగి ఉండగా.. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ప్రసాద్ పలు పేటెంట్లు పొందారు.

24 కిలోల గంజాయి స్వాధీనం



వరంగల్‌లో గంజాయితో పట్టుబడిన దంపతులు

ఖిలా వరంగల్: రైలులో గంజాయి తరలిస్తున్న దంపతులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో సంబంధిత అధికారులు నిఘా పెట్టారు. ఈక్రమంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన దంపతులు గోగి శంకర్‌దాస్– గోగి పూర్ణిమదాస్‌లు ఒడిషాలో ప్రదీప్ అనే గంజాయి స్మగ్లర్ వద్ద 24 కిలోల గంజాయి కొనుగోలు చేసి ముంబై–భవనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయల్దేరారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి బయటకు వెళ్లేందుకు యత్నిస్తుండగా.. డగ్స్ కంట్రోల్ టీం, మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్ వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. వారిని అరెస్టు ఎండు గంజాయి, 2సెల్‌ఫోన్లు స్వాధీన పర్చుకుని మిల్స్‌కాలనీ స్టేషన్‌కు తరలించారు.

పలువురు విద్యార్థులకు అస్వస్థత

- బాదంకాయలనుకుని వేరే కాయలు తిన్న జయగిరి వసతి గృహం విద్యార్థులు
- ఆరుగురిని ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు



వసతి గృహంలో చికిత్స అందిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం : హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలోని మహాత్మా రావుజ్యోతి పూలే వసతి గృహంలో బాదంకాయల మాదిరిగా ఉన్న వాటిని తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 15 మంది విద్యార్థులు శుక్రవారం బాదంకాయలు అనుకుని అదేమాదిరిగా ఉన్న వేరేకాయలను తిన్నారు. విషయం తెలుసుకున్న వైద్యారోగ్యశాఖాధికారులు అక్కడికి చేరుకుని వారిని పరిశీలించారు. వసతి గృహంలోనే చికిత్స అందించినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. వారిలో తీవ్ర అస్వస్థతకు గురైన ఐదవ తరగతి చదువుతున్న సుశాంత్, సచిన్, హరికృష్ణ, సామ్యూల్, చందు, రిషిత్‌లను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు.

నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

కాళోజి సెంటర్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా మరోమారు అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి పిలుపునిచ్చారు. జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, అధ్యాపకుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, గురుకులాల పనివేళలను మార్చాలని, డిప్యూటీ వార్డెన్, కేర్ టేకర్లను నియమించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నర్సిరెడ్డి మరోసారి ఎమ్మెల్సీగా గెలిస్తేనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని రవి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప, తాటికాయల కుమార్, సుజన్ ప్రసాదరావు, మేకిరి దామోదర్, భగవంత రావు, గుండు కరుణాకర్ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లపై విచారణ చేయాలి: పెద్ది

వరంగల్: సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యాపారులు మార్కెట్‌కు వచ్చిన పత్తిని రూ.5 వేల నుంచి 6 వేలకు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. సీసీఐకి విక్రయిస్తే రూ.7521 మద్దతు ధర వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను ఇటీవల సస్పెండ్ చేయడం అవినీతి అక్రమాలకు నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఈ కుంభకోణం జరిగిందని, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేసిందని ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా




ధర్నాలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

హన్మకొండ చౌరస్తా: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వరంగల్ జిల్లా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో అశోక జంక్షన్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద వివిధ బ్యాంకుల ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో పనిఒత్తిడికి సరిపడా నియామకాలు చేపట్టాలని, ఐదు రోజుల పనిదినాలు వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులకు పనిచేసే ప్రాంతంలో రక్షణ కల్పించాలని, వర్క్‌మెన్ డైరెక్టర్, ఆఫీసర్లు, డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగుల సంక్షేమ ప్రయోజనాలపైన వేసే ఆదాయ పన్ను బ్యాంకులే భరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 21న మరో ధర్నాతోపాటు మార్చి 3న పార్లమెంట్ ఎదుట ధర్నా, మార్చి 24, 25వ తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో అన్ని బ్యాంకుల ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ సమితి కార్యదర్శి శశిధర్‌రెడ్డి, రాకేష్, కృష్ణమోహన్, రఘు, వేణుమాధవ్, ఏఐబీటీసీ దిలీప్‌కుమార్, అనిల్, సుందర్ నాయక్, శ్రీనివాస్, సాహిత్య, శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

- మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వరంగల్ చౌరస్తా: ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఐక్యమత్యంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావది లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశం వరంగల్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న తెలంగాణ మహాసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని, అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాబోయే కాలంలో ఆర్యవైశ్యుల విద్య, వైద్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో భారీ భవనాలను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రేణుకుంట్ల గణేష్ గుప్తా, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆగిరి వెంకటేష్, గార్లపాటి శ్రీనివాస్, తోట సురేష్, తల్లాడ వెంకటరామయ్య, రమేశ్, పవిత్ర శ్రీనివాస్, దొడ్డమోహన్ రావు, శ్రీనివాస్, శ్రీ రామ్ రవీందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించండి

వరంగల్: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ఆమె పీఎం శ్రీ, సర్వశిక్ష అభియాన్ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లా పరిధిలో పీఎంశ్రీ పథకం కింద 16 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తయ్యాయని, కొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా సర్వశిక్ష అభియాన్ నిధులతో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. డీఆర్‌ఓ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA, P.hd, ఓపెన్ టెన్త్ & ఇంటర్ (4 నెలల్లో పూర్తి) Dr.J.S. అకాడమీ (ISO సర్టిఫైడ్) 8866977112. [HA-15389]

SERVICES

■ సిరి అసోసియేట్స్ హౌస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ రేకుల, గుడిసె పెంక ఇల్లు పైసిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును 9666142226 [SCA25001599]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

WANTED

■ Wanted PROs / Agents for MBBS, B.Tech abroad admissions. Cont: 8121554649. [WA-3281]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-SCA25001637]

■ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. జీతం 10000 నుండి 15000 వరకు. సెల్: 9014980722. [SCA25001640]

■ రిపోర్టర్స్ కావలెను. తెలుగు జాతీయ దినపత్రిక ప్రభాత దర్శిని కొరకు అనుభవం గల రిపోర్టర్ కావలెను. సంప్ర : 9493272754, 9392557010 [HA-15142]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.